# ఆస్తి విలువ పై ఇంటి పన్ను విధానాన్ని రద్దు చెయ్యాలి!
# చెత్త, మురుగు నీటిపై పన్ను ఉపసంహరించాలి!

## ఆస్తి పన్ను నోటిఫికేషన్ రద్దుకై అభ్యంతరాలు తెలియ జెయ్యండి!

### విశాఖ నగర ప్రజలకు విజ్ఞప్తి

సోదరీ, సోదరులారా !

కరోనా కష్ట కాలంలో విశాఖ నగర ప్రజలపై ఆస్తి పన్ను పెంపు, చెత్త పన్ను పెంపు, మురుగునీటి ఛార్జీల పెంపులను రద్దు చెయ్యాలని జివిఎంసి నగర కమిషనర్‌ను వార్వా-నివాస్ డిమాండ్ చేస్తున్నవి.

కరోనా కష్టాలతో ప్రజలకు బతకడమే దుర్భర మయింది. ఉద్యోగులు, కార్మికులు ఉపాధి కోల్పోయారు, ఆదాయాలు కోల్పోయారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థతతో రెండో దశ అసంఖ్యాక ప్రాణాలు బలితీసుకుంది. మూడో దశ ఇంకెన్ని బాధలకు గురి చేస్తుందోననే భయంతో ప్రజలు వణకి పోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలవాలి. కానీ, కేంద్ర ప్రభుత్వ షరతులకు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం 198 జివో తెచ్చి, మార్కెట్ విలువపై ఆస్తి పన్ను వేసే విధానం అమలు చేసి ఆస్తి పన్ను భారీగా పెంచింది. దీనికి అణుగుణంగా జివిఎంసి కమీషనర్ చేత జూన్ 3వ తేదీన ముసాయిదా నోటిఫికేషన్ కూడా జారీ చేయించింది. దీనితో పాటు చెత్త పన్ను కూడా భారీగా పెంచింది. ఇతర సేవలపై యూజర్ ఛార్జీలను వసూలు చెయ్యడానికి సిద్ధపడుతున్నది. ఈ ఆస్తి పన్ను పెంపును, విధాన మార్పులకు చెందిన జూన్ 3 నోటిఫికేషన్ ను రద్దు చెయ్యాలని వార్వా- నివాస్ డిమాండ్ చేస్తున్నవి.

**ఆస్తి విలువ ఆధారంగా ఇంటి పన్నులు :**

ఇప్పటి వరకు సాలుసరి అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధిస్తున్నారు. ఈ విధానం నుండి ఆస్తి మూల ధన విలువ ఆధారంగా విధించే విధానానికి మార్చారు. ఆస్తి మూలధన విలువ అంటే భూమి విలువ మరియు భవనం విలువల మొత్తం. ఈ రెండింటి మొత్తం యొక్క మార్కెట్ విలువ పైన ఆస్తి పన్ను విధిస్తారు. ఈ విలువలు స్టాంప్&రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ వారు ప్రతి ఏడాదీ సవరించి ప్రకటిస్తారు.

నివాస గృహాలకు 0.15%, నివాసేతర గృహాలకు 0.30%, ఖాళీ స్థలాలపై 0.50% ఆస్తి పన్ను విధిస్తారు. భూముల విలువలు ప్రతి ఏడాది పెంచుతారు. భూమి విలువ పెరిగి నప్పుడల్లా ఆస్తి పన్ను పెంచుతారు. సవరించిన ఆస్తి పన్ను ను ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుండి అమలు చేస్తారు. ఇంటి ప్లాను 10% కంటే తక్కువ ఉల్లంఘన ఉంటే 25%, ఆపైన 50%, ప్లాన్ లేకపోతే 100% పెనాల్టీ వేస్తారు. ఈ కొత్త విధానంలో ఇళ్ళ పన్నులు 3 నుండి 6 రెట్లు వరకు పెరిగే ప్రమాదముంది. విశాఖ నగరంలో దాదాపు 700 కోట్ల రూపాయలు ప్రజలపై భారం పడుతుంది. ఏమయినా అభ్యంతరాలు ఉంటే జూలై 4వ తేదీ లోగా జివిఎంసి కమీషనర్ గారికి ఆఫీస్ లో గాని, ఆన్లైన్ లో గాని దాఖలు పరుచుకోవాలి.

PTO

## 15 శాతం పెరుగుదల

పాత పన్నులపై 15% కి మించి పెరగవని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. అలాంటప్పుడు పాత విధానాన్నే కొనసాగించవచ్చు కదా? 375 చదరపు అడుగులలోపు ప్లింత్ ఏరియా ఉన్న పేదల ఇళ్ళకు రూ.50లు మాత్రమే పన్ను వేస్తారని కూడా చెప్పింది. కానీ ఈ విషయాలను చట్టంలో పెట్టలేదు. జివిఎంసి నోటిఫికేషన్‌లో చేర్చలేదు. ఎందుకని? ప్రజలను మభ్య పెట్టడానికే 15% ఎర. కొత్త విధానం అమలులోకి వచ్చిన తర్వాత అదును చూసి 15% ఆఫర్ ఉపసంహరించవచ్చు. ప్రతి ఏటా 15% పెంపు కూడా భరించలేని భారమే. ఐదేళ్ళలో ఇది 100% దాటి పోతుంది. 15% ట్రాప్‌లో పడకుండా ఆస్తి పన్ను పెంపును, విధాన మార్పును తిప్పి కొట్టాలి.

## చెత్తపై పన్ను

చెత్త పన్ను ను అనూహ్యంగా పెంచారు. ప్రతి నివాస గృహమూ నెలకిరూ.120/- లు చెత్త పన్ను చెల్లించాలి. వాణిజ్య సంస్థలు రూ.200/- ల నుండి రూ 15000/- వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇంత భారీగా పెంచడం అన్యాయం. అందుకే జవిఎంసి జారీ చేసిన చెత్త పన్ను ఉత్తర్వులను ఉపసంహరించు కోవలసిందిగా కోరుతున్నాము. ఇవి కాక మంచినీటి ఛార్జీల పెంపు, మురుగు నీటి ఛార్జీల పెంపునకు కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. నగర ప్రజలపై చెత్త పన్ను ద్వారా రూ 180 కోట్లు భారాలు పడతాయని అంచనా.

## జివిఎంసి కౌన్సిల్‌కు అవమానం

మార్చి 18 వ తేదీన మన జివిఎంసి కి నగర ప్రజల చేత నూతనంగా ఎన్నుకోబడిన కౌన్సిల్ ఏర్పడింది. 98 మంది కార్పొరేటర్లు నగర ప్రజల చేత ఎన్నుకోబడ్డారు. వీరందరూ ఏకగ్రీవంగా మేయరు నెన్ను కున్నారు. వీరిని కాదని, జివిఎంసి కమీషనర్ చేత జూన్ 3 వ తేదీన నోటిఫికేషన్ ఇప్పించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇది ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయిన కౌన్సిల్ ను అవమాన పరచడమే. ఇది అప్రజాస్వామికం మరియు చట్ట వ్యతిరేకం. **ఆస్తి పన్ను, చెత్త పన్నులపై జివిఎంసి కౌన్సిల్ లో చర్చ జరిపి, నగర ప్రజలకు కష్టం కలగకుండా నిర్ణయం తీసుకోవాలని వార్వా - నివాస్ డిమాండ్ చేస్తున్నవి.**

పెట్రోల్ డీజిల్ ధరలు నిత్యం పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నది కేంద్ర ప్రభుత్వం. నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కరోనా ప్రజల బతుకుల్ని ఛిద్రం చేస్తున్నది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పన్నుల్లో రాయితీలిచ్చి, ప్రజలకు సహాయ పడాల్సింది పోయి పన్నులు పెంచడం అమానుషం. కాబట్టి, ఆస్తి పన్ను పెంపు, విధాన మార్పు, చెత్త పన్ను పెంపుదల లను వ్యతిరేకించండి.

ఆస్తి పన్ను నోటిఫికేషన్‌కి వ్యతిరేకంగా జివిఎంసి కమీషనర్‌కు వ్రాతపూర్వకంగా ఆన్‌లైన్‌లో గాని ఆఫ్‌లైన్‌లో గాని అభ్యంతరాలు తెలియ జేయాలని, పన్ను దాడులను తిప్పి కొట్టాలని 'వార్వా - నివాస్' విజ్ఞప్తి చేస్తున్నవి.

**Mail id of GVMC Commissioner**
**commissioner_gvmc@yahoo.co.in**

**బి.బి గణేష్, ప్రధాన కార్యదర్శి**
**వార్వా - 9440133400**

**పి.నారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి**
**నివాస్ - 94917 89269**

అడ్రస్ : బి-25, జీవన్‌సుధ అపార్ట్‌మెంట్స్,ఎంఎంటిసి కోలనీ, హెచ్‌బికోలనీ, విశాఖపట్నం-22

Prajasakti Printers & Publishers Pvt.Ltd.@Vizag